సాక్షి నంద్యాల

సోమవారం, 6, మార్చి, 2023



ఆది దంపతులకు పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆలయ ప్రదక్షిణ చేశారు.



రమణీయం.. రథోత్సవం

మంత్రాలయం రూరల్: రాఘవేంద్రస్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. ఆదివారం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథంపై ఉంచి ఊరేగించారు.



ఊపిరి పోసి.. ప్రాణం నిలిపి

నంద్యాల సర్వజనాసుపత్రి పేదల పాలిట వరంగా మారింది. నాడు -నేడు కింద ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తేవడంతో వైద్యులు క్లిష్టమైన ఆపరేషన్లు చేస్తున్నారు.

8లో

న్యూస్‌రీల్

శ్రీ మద్దిలేటిస్వామి క్షేత్రానికి రూ.2.25 లక్షల విరాళం



ఆలయ చైర్మన్, ఈఓకు విరాళం అందజేస్తున్న దాత

బేతంచెర్ల: జిల్లాలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి చెందిన బాల మద్దయ్య గౌడ్, కాశీ విశ్వనాథ్ జ్ఞాపకార్థం తులసీ నాథ్ గౌడ్ రూ. 2.25 లక్షల విరాళం ఆదివారం అందజేశారు. క్షేత్ర పరిధిలో శ్రీఅనిరుద్ధమూర్తి, శ్రీ అచ్యుతామూర్తి, శ్రీ సత్యమూర్తి విగ్రహాలను నెలకొల్పేందుకు రూ.2.25 లక్షలు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను సత్కరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, దాత కుటుంబ సభ్యులు లోకేశ్వర్ గౌడ్, నాగరాజు, ప్రతాప్, శ్రీనివాసమూర్తి, చంద్ర, ప్రకాష్, తిలక్ పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 173 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు ఆదివారం 173 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగం పరీక్షలను 74, వొకేషనల్ పరీక్షలను 9 కేంద్రాల్లో నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 6,286 మందికి గాను 6,157 మంది, వొకేషనల్ విద్యార్థులు 766 మందికి గాను 722 మంది హాజరయ్యారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

పత్తికొండ రూరల్: పత్తికొండలోని ఏపీఆర్ బాలుర గురుకులం, మోడల్ స్కూల్ విద్యార్థుల మధ్య శనివారం రాత్రి ఘర్షణ జరిగింది. ఏపీ మోడల్ స్కూల్‌లో ఫేర్‌వెల్ పార్టీ ముగించుకుని విద్యార్థిని, విద్యార్థులు తిరిగి వెళ్తుండగా కొందరిని బాలుర గురుకులం విద్యార్థులు హేళన చేశారు. ఇది సరికాదని మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రశ్నించడంతో గురుకులం విద్యార్థులు వారిని చితకబాదారు. అక్కడి నుంచి వెళ్లిన మోడల్ స్కూల్ విద్యార్థులు కొంతసేపటికి మిత్రులను అక్కడికి తీసుకొచ్చి గురుకులం విద్యార్థులపై దాడి చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న సీఐ మురళీమోహన్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ కర్నూలు



చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న కర్నూలు బాలుర జట్టు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న 8వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో చాంపియన్‌గా కర్నూలు జిల్లా బాలుర జట్టు నిలిచింది. విశాఖపట్నం రెండో స్థానం, పశ్చిమగోదావరి జిల్లా, చిత్తూరు జిల్లాలు మూడో స్థానంలో నిలిచాయి. మొదటి సెమీ ఫైనల్‌లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు 10 గోల్స్ చేయగా కర్నూలు జిల్లా జట్టు 18 గోల్స్‌తో విజయకేతనం ఎగురవేసింది. రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరు జిల్లా 20గోల్స్ చేయగా 24 గోల్స్ చేసి విశాఖపట్నం జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. ఫైనల్‌లో విశాఖపట్నం జట్టు 18 గోల్స్ చేయగా కర్నూలు 23 గోల్స్‌తో చాంపియన్‌గా నిలిచింది. విజేతలకు వ్యక్తిగత బహుమతులు, ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు జగదీష్‌కుమార్, న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, పోటీల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి, రాజేష్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 10 వరకు ఎల్లెల్సీకి నీరు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువకు ఏప్రిల్ 10 వరకు నీరు సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం టీబీ డ్యాంలో 25.990 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో ఏమీ లేకపోగా, వివిధ కాలువలకు 8,039 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రబీలో సాగు చేసిన వరి చేతికందాలంటే 50 రోజుల సమయం పడుతుంది. కనీసం ఏప్రిల్ 20 వరకు కాలువకు నీరు వదలాలని రైతులు కోరుతున్నారు.

కల్యాణ వైభోగం

- నయనానందకరం శ్రీ ప్రహ్లాదవరదుడి కల్యాణం
- నల్లమలలో మారుమోగిన గోవింద నామస్మరణ
- పరవశించిన భక్త జనం



మంగళసూత్రాన్ని చూపుతున్న ప్రధానార్చకులు

ఆళ్లగడ్డ: సకల కల్యాణ గుణ పరిపూర్ణుడైన దేవదేవుడు వరదహస్తుడై ఆశీర్వదించిన వేళ.. స్వామివారి కరుణా కటాక్ష వీక్షణాలకై భక్తజనం పోటెత్తిన సమయాన.. ఉగ్రం వీరం మహావిష్ణుం.. ఓం నమో నారసింహాయ.. అంటూ నామస్మరణలు మిన్నంటిన వేళ జరిగిన శ్రీ ప్రహ్లాదవరదుడి కల్యాణంతో భక్తజన కోటి పరవశించిపోయింది. అహోబిల పుణ్యక్షేత్రంలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి వారి పరిణయోత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా వేద పండితులు పుణ్యాహవచనం చేసి నవగ్రహ మంటపరాధన అనంతరం విశేష పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సమర్పించిన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను పెండ్లి కూతురు, పెండ్లి కుమారుడిగా ముస్తాబు చేసి మంటపంలో కొలువుంచారు. ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహించిన అనంతరం వైష్ణవ ఆచారంగా వేద పండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య మాంగళ్య ధారణ నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు కార్యక్రమం పూర్తి చేశారు. కమనీయ దృశ్యాన్ని తనివితీరా చూసిన భక్తకోటి మురిసిపోయింది. నూతన వధూవరులైన ప్రహ్లాదవరదుడు, అమృతవల్లిని దర్శించుకుని పునీతులయ్యారు.

ఆకట్టుకున్న ఎదుర్కోళ్ల ఉత్సవం..

స్వామి వారి కల్యాణోత్సవంలో ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా స్వామి తరుపున కొందరు, అమ్మవారి తరుపున మరి కొందరు అర్చకులు బంధువులుగా విడిపోయి పెద్ద మనుషులుగా వ్యవహరించారు. కట్నకానుకలు, ఆడపడుచు లాంఛనాలు, ఇచ్చి పుచ్చుకోవడం తదితర విషయాలు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుకునే మాటలు విశేషంగా అలరించాయి.



ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

చిట్టి చిన్నారి.. ఆంగ్ల అభ్యాసి

- వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు
- ఆంగ్లంలో బోధన, బొమ్మలతో అభ్యాసన
- చిన్నారులను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు





బొమ్మలు చూపించి పిల్లలకు ఇంగ్లిషులో బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

నందికొట్కూరు: 'చిట్టి చిలకమ్మా.. అమ్మ కొట్టిందా.. పండు తిన్నావా' అంటూ ముద్దు ముద్దుగా పలికే అంగన్‌వాడీ చిన్నారులు ఇంగ్లిషులో కూడా ట్వింకిల్ ట్వింకిల్.. లిటిల్ స్టార్.. అంటూ పాడుతుంటే తల్లిదండ్రులు ఎంతో సంతోషపడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు చిరు ప్రాయం నుంచే బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలతో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. అంగన్‌వాడీలను వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చి వేసి ఆంగ్ల విద్యాబోధన ప్రవేశపెట్టడంతో చిన్నారులను అందులో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రీ ప్రైమరీ దశలోనే చదువుకు సంబంధించి ప్రాథమిక నైపుణ్యాల్ని పటిష్టం చేసే దిశగా అంగన్‌వాడీల్లో కొత్త సిలబస్, కొత్త పుస్తకాలు, బొమ్మలను అందుబాటులోకి తెచ్చారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల మాధ్యమాన్ని బోధించేందుకు ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. పుస్తకాలు ముందుంచి బోధించే కన్నా బొమ్మలతో అర్థమయ్యే రీతిలో ఆంగ్లంలో చిన్న చిన్న పదాలు నేర్పిస్తున్నారు. దీంతో చిన్నారులు ఐదో తరగతి పూర్తయ్యే నాటికి తెలుగుతో పాటు ఆంగ్లంలో కూడా అనర్గళంగా మాట్లాడే స్థాయికి చేరే అవకాశం ఉంది. జిల్లాలోని 29 మండలాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 1,663 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో 30,285 మంది చిన్నారులున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలన్నీ వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా రూపాంతరం చెందాయి. మూడేళ్లకు పైబడిన చిన్నారులకు ప్రైమరీ, నాలుగేళ్లు పైబడిన చిన్నారులకు నర్సరీ, ఐదేళ్లు పైబడిన చిన్నారులకు యూకేజీ తరగతులు నిర్వహించి ఆంగ్ల మాధ్యమాన్ని బోధిస్తున్నారు. అందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయ మహిళ సంరక్షణ కార్యదర్శులకు గతంలో శిక్షణ పొందారు. దీంతో పాటు ఆట, పాట, మాట, సృజనాత్మకత, సంసిద్ధత, కథ అనే అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సులభతరమైన రీతిలో చిన్న, చిన్న ఆంగ్ల పదాలతో విద్యా బోధన చేస్తున్నారు.

ఆడుతూ.. పాడుతూ..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు, సహాయకులు చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపుతూ చదువుపై ఆసక్తి కల్పిస్తున్నారు. నీతి కథలను వివరించడంతో పాటు బొమ్మలను చూపించి పదాలను పలికిస్తున్నారు. ఆటపాటలు ఏ విధంగా నేర్పాలనే విధానాన్ని దృశ్య రూపంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. చిన్నారులకు మరింతగా అలరించే విధంగా యూట్యూబ్ చానల్‌ను రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ప్రీప్రైమరీ స్కూళ్ల వివరాలు

నియోజకవర్గం	అంగన్‌వాడీ కేంద్రాలు	3–6 ఏళ్ల లోపు చిన్నారులు
నందికొట్కూరు	282	7,117
నంద్యాల	159	3,331
ఆళ్లగడ్డ	255	7,898
శ్రీశైలం	214	1,611
పాణ్యం	101	1,956
బనగానపల్లె	404	2,684
డోన్	248	5,688
మొత్తం	1,663	30, 285



బొమ్మలతో ఆటలు ఆడిస్తున్న అంగన్‌వాడీ టీచర్

ప్రీ ప్రైమరీ పాఠశాలలో బోధన ఇలా..



బొమ్మలతో ఆటలు ఆడుకుంటున్న చిన్నారులు

- ప్రతి చిన్నారికి పుస్తకాలు, ప్రీ స్కూల్ కిట్స్, కలర్ కార్డులు, బిల్డింగ్ బ్లాక్స్, ఫ్లాష్ కార్డులు, పోస్టర్లు, చార్ట్స్, లెర్నింగ్ కిట్స్
- రీడింగ్, స్టోరీ టైం, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ యాక్టివిటీ తదితర అంశాలతో పిల్లలకు విద్యాబోధన
- మధ్యలో చిన్నారులు విశ్రాంతి తీసుకోవడానికి గంటన్నర పాటు విరామం

నా బిడ్డ ఏబీసీడీలు చెబుతోంది



పేద పిల్లల చదువుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేస్తున్నారు. నర్సరీ మొదలు ఉన్నత చదువులు చదివే వరకు సాయం చేసి ఆదుకుంటున్నారు. అంగన్‌వాడీలో ఇంగ్లిషు మీడియం అమలు చేయడంతో నా బిడ్డ ఏబీసీడీలు అప్పుడే నేర్చుకుంది. – లక్ష్మీదేవి గువ్వలకుంట్ల గ్రామం, కొత్తపల్లి మండలం

ఇంగ్లిషులో పాటలు పాడుతోంది



మారుమూల పల్లెటూరు పిల్లలు ఇంగ్లిషు చదువులు నేర్చుకోవాలంటే ప్రైవేటు స్కూళ్లకు పోవాలి. జగనన్న సీఎం తర్వాత ప్రభుత్వ బడులు మారిపోతున్నాయి. అంగన్‌వాడీల్లో ఇంగ్లిషు చెబుతుండటంతో నా కూతురు శ్రీవర్షిణి ఇంగ్లిషులో పాటలు పాడుతుంది. నాకు చాలా సంతోషంగా ఉంది.

– సుజాత నాగటూరు గ్రామం, నందికొట్కూరు మండలం

జగనన్న మేలు మరువలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టి చరిత్రలో నిలిచిపోయారు. మా పేద కుటుంబాల పిల్లల భవిష్యత్తుకు జగనన్న బంగారు బాటలు వేశారు. పట్టణ కేంద్రాల్లో కూడా చాలా మంది తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– గౌతమి, నందికొట్కూరు

బొమ్మలతో ఆసక్తి పెంచుతున్నాం



అంగన్‌వాడీ చిన్నారులకు తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమంలో బోధన అందిస్తున్నాం. బొమ్మలతో ఆడిస్తూ చిన్నారుల్లో ఆసక్తి పెంచుతున్నాం. వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలలతో సత్ఫలితాలు వస్తున్నాయి. 3ప్లస్ పిల్లలకు పీపీ–1 పుస్తకం ద్వారా ఇంగ్లిషు నేర్పిస్తాం. 4ప్లస్, 5ప్లస్ పిల్లలకు పీపీ–2 ఇంగ్లిషు, ఇంగ్లిషు వర్క్, లెక్కల్, లెక్కల్ వర్క్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిషు పుస్తకాలు ప్రభుత్వం అందించింది. ప్రతి రోజు టైం టేబుల్ ప్రకారం పిల్లలకు బోధన ఉంటుంది. ఆడుకోవడానికి ఆట వస్తువులు ప్రభుత్వం సరఫరా చేసింది. – ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరి, నందికొట్కూరు ప్రాజెక్టు

మాజీ ఎమ్మెల్యే బీసీకి షాక్

- వైఎస్సార్‌సీపీలో చేరిన యనకండ్ల టీడీపీ నాయకులు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,ఉమ్మడి జిల్లాల పరిశీలకులు రామసుబ్బారెడ్డిల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యనకండ్ల టీడీపీ నాయకులు

బనగానపల్లె: టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి స్వగ్రామం యనకండ్లలో 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసానితో పాటు ఉమ్మడి జిల్లాల పరిశీలకులు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, నాయకులు కాటసాని ఓబులరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి సమక్షంలో యనకండ్ల గ్రామానికి చెందిన నొస్సం సాంబశివారెడ్డి, నొస్సం మహేశ్వరరెడ్డి, గొల్ల బ్రహ్మం, గడ్డం భాస్కర్ రెడ్డితో పాటు పది కుటుంబాలు టీడీపీ వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో కష్టపడే నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, సాదుల శంకర్‌రెడ్డి, బొబ్బల రాజశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గొల్ల శేషన్నయాదవ్, నాగేంద్రారెడ్డి సంజీవయ్యగౌడ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా 'కామదహనం'

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఫాల్గుణ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోని మనోహర గుండం ఎదురుగా కొలువుంచి విశిష్ట పూజలు నిర్వహించారు. ఆతర్వాత ఉత్సవమూర్తులను పల్లకీలో గంగాధర మండపం వద్దకు తోడ్కొని వచ్చి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేపట్టారు. అనంతరం గడ్డితో చేసిన మన్మథ రూపాన్ని దహనం చేశారు. చివరగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కామదహనం కార్యక్రమాన్ని వీక్షించడంతో శివకటాక్షం లభిస్తుందని పండితులు చెప్పారు. కార్యక్రమాల్లో దేవస్థాన ఈఓ ఎస్. లవన్న, అర్చకులు, వేదపండితులు అధికారులు పాల్గొన్నారు.



కామదహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఈఓ

ఆన్‌లైన్‌లో ప్రచార జోరు

- వాడీవేడిగా ఎమ్మెల్సీ ఎన్నికలు
- దగ్గర పడుతున్న పోలింగ్ సమయం
- ఐవీఆర్‌ఎస్ ద్వారా నేరుగా అభ్యర్థులే తమ వాయిస్‌ను వినిపిస్తున్న వైనం
- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌ల వేదికగా ఓటు అభ్యర్థన
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రారెడ్డి



కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం ఆన్‌లైన్‌లో హోరెత్తుతోంది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వేదికగా అభ్యర్థులు తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులతోపాటు వారి అనుచరులు కూడా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి స్థానం నుంచి 49 మంది, ఉపాధ్యాయ స్థానం నుంచి 12 మంది మొత్తం 61 మంది బరిలో ఉన్నారు. పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ నుంచి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీడీపీ నుంచి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, బీజేపీ నుంచి నగరూరు రామచంద్రారెడ్డి, వామపక్షాల అభ్యర్థిగా నాగరాజుయాదవ్ బరిలో ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ స్థానం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పీడీఎఫ్ అభ్యర్థిగా, ఎంఎస్ రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ మద్దతుతో, ఒంటేరు శ్రీనివాసరెడ్డి టీడీపీ మద్దతుతో పోటీలో దిగారు.

సామాజిక మాధ్యమాలే వేదికలు

పోలింగ్‌కు తక్కువ సమయం ఉండటంతో అభ్యర్థులు ఆన్‌లైన్ ప్రచారానికి ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. తమను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నెరవేర్చే హామీలను ఆన్‌లైన్‌లో ఉంచుతున్నారు. ప్రధానంగా ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌లను వేదికలుగా చేసుకుని ప్రచారం కొనసాగిస్తున్నారు. వాట్సాప్ స్టేటస్‌లలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారాలు కనిపిస్తున్నాయి. ఫేస్‌బుక్ గ్రూపుల్లోనూ ఓటు అభ్యర్థనలు ఉంటున్నాయి. కొందరు ఆడియో, వీడియోలను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆయా ఫొటోలు, ఆడియో, వీడియోలు లైక్‌లు, షేర్లతో అన్ని గ్రూపుల్లో ప్రచారాలు హోరాహోరీగా నడుస్తున్నాయి.

ఐవీఆర్‌ఎస్ ద్వారా...

పోటీలో ప్రధానంగా ఉన్న అభ్యర్థులందరూ నేరుగా ఓటర్లకు తమ సందేశాన్ని పంపేందుకు చూస్తున్నారు. ఇందుకోసం ఐవీఆర్‌ఎస్ (ఇంట్రాయాక్టివ్ వాయిస్ రెస్పాన్ సిస్టం)ను ప్రధానంగా ఎంచుకున్నారు. నేరుగా వారే ఫోన్ ద్వారా ఓటర్లను పలకరిస్తున్నారు. తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. అంతేగాక పోలింగ్ తేదీ, ఓటు ఎక్కడ ఉందో కూడా తెలుపుతున్నారు.

దగ్గరపడుతున్న సమయం

పశ్చిమరాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. మార్చి 13వ తేదీన పోలింగ్ జరగనుండడంతో అభ్యర్థులు ప్రచారాలను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో ముమ్మరం చేశారు. సమయం కేవలం 8 రోజులే ఉండడంతో కుటుంబ సభ్యులతో కలసి ప్రచారం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరఫున పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్లను కలుసుకొని తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు.

దూసుకుపోతున్న వెన్నపూస, ఎంఎస్ రామచంద్రారెడ్డి

ఆన్‌లైన్ ప్రచారాల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంఎస్ రామచంద్రారెడ్డి దూసుకుపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూపించి తమకు ఓటు వేయాలని వారు కోరుతున్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను చూపించి ఆన్‌లైన్‌లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలకు ఇస్తున్న ప్రాధాన్యతలను వివరించి ప్రచారంలో దూసుకుపోతున్నారు. వీరేకాక బరిలో ఉన్న ఇతరులు కూడా ఆన్‌లైన్‌లో ప్రచారంలో మునిగి తేలుతున్నారు.



'స్వచ్ఛంద' సేవ

ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొందరు యువతీ, యువకులు వినూత్నంగా ఆలోచించారు. ఆదివారం రోడ్డు సైడు వ్యాపారం చేసుకునే మహిళలను కూర్చోబెట్టి వారి వ్యాపారాన్ని వీరే రోజంతా నిర్వహించారు. వచ్చిన మొత్తాన్ని వారికి అప్పగించి, ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, ఇంటి పనిలో తల్లులకు, సతీమణులకు సహాయం చేయాలని క్రియేటర్స్ బార్న్ టు హెల్ప్ అనే స్వచ్ఛంద సంస్థ యువకులు అరవింద్, రవి తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



ఊపిరి పోసి.. ప్రాణం నిలిపి



ఆర్థో ఆపరేషన్ థియేటర్

- నంద్యాల ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సలు
- నాడు–నేడు ద్వారా అందుబాటులోకి అధునాతన ఆపరేషన్ థియేటర్లు
- అత్యాధునిక వైద్య పరికరాలతో పేదలకు ఆపరేషన్లు
- జిల్లా వాసులకు పెద్దాసుపత్రిగా మారుతున్న వైనం

బొమ్మలసత్రం: ఒకప్పుడు అత్యవసర సమయంలో ప్రాథమిక చికిత్సతో పాటు చిన్న చిన్న ఆపరేషన్లు మాత్రమే జరిగే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఇప్పుడు పేదల పాలిట వరంగా మారింది. పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నాడు - నేడు కార్యక్రమం కింద ఆసుపత్రిని ప్రక్షాళన చేసి ఆధునికీకరించింది. కొన్నేళ్లుగా మొరాయిస్తున్న యంత్రాలు, పరికరాల స్థానంలో అధునాతనమైనవి అందుబాటులోకి తెచ్చింది. ఒకప్పుడు క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయాలంటే వైద్యులకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉండేవికావు. ప్రస్తుతం ప్రాణప్రాయ స్థితిలో ఉన్న రోగులకు ఎంతటి కష్టతరమైనా శస్త్రచికిత్స చేసి ప్రాణాలు నిలబెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు - నేడు కార్యక్రమం కింద రూ.5 కోట్ల వ్యయంతో భవనాల ఆధునికీకరణ, అధునాతన ఆపరేషన్ పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. ఆర్థోపెటిక్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ విభాగాల్లో దాదాపు 23 రకాల శస్త్ర చికిత్సలు ఆసుపత్రిలో ఉచితంగా చేస్తున్నారు. ఇవే కాకుండా సిబ్బంది కోసం ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేశారు. థియేటర్లలో ఆపరేషన్‌లకు అవసరమయ్యే ఎండోస్కోపి, లాప్రోస్కోపి, వర్క్ స్టేషన్, వెంటిలేటర్, సీఏఆర్ఎమ్ యంత్రం, ఎక్స్‌రే, హారిజాంటల్ ఆటోక్లేవ్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ లాంటి అధునాతన పరికరాలు ఉన్నాయి.

పేదలకు ఆరోగ్య సిరి

ఆరోగ్యశ్రీ ద్వారా పేదల కోసం సర్వజన ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు. ఎముకలకు సంబంధించిన విభాగంలో విరిగిన చేతులు, కాళ్లకు సర్జరీ, రాడ్లు, ప్లేట్లు అమర్చటం లాంటి ఆపరేషన్‌లు జరుగుతున్నాయి. జనరల్ సర్జరీ విభాగంలో హెర్నియా, హైడ్రోసిల్, అపెండిక్స్, పైల్స్, పిస్టులా, కొలోసెక్టమి, పారాటిడ్ పర్ఫరేషన్, లంప్ బ్రెస్ట్, సింపుల్ థైరాయిడ్, లాప్రోస్కోపిక్ సర్జరీ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈఎన్‌టీ విభాగంలో అడినో టోన్సిలెక్టమీ, టింపోనిప్లాస్టి, మిరిన్గోటోమి, సెప్టోప్లాస్టి, ఫెస్, టర్బినో ప్లాస్టి లాంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.

అధునాతన హంగులు....

గత కొన్నేళ్లుగా ఆసుపత్రిలో పాడుబడిన భవనంలోనే పేదలకు ఆపరేషన్ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నాడు - నేడు ద్వారా ఈ భవనాల రూపు రేఖలు మార్చేసింది. భవనాలను ఆధునికీకరించటమే కాకుండా అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. నంద్యాల సర్వజన ఆసుపత్రిలో ఇప్పటికే ఓపి భవనం, జిరియాట్రిక్ భవనం, డీఈఐసీ భవనాల నిర్మాణాలు పూర్తి చేసి ప్రతి రోజు 1400 మందికి పైగా ఈ భవనాల్లో రోగులకు సేవలందిస్తున్నారు. ఆపరేషన్‌ల కోసం ఈఎన్‌టీ మైనర్ ఆపరేషన్ థియేటర్, ఈఎన్‌టీ మేజర్ ఆపరేషన్ థియేటర్, జనరల్ సర్జరీ మేజర్ ఆపరేషన్ థియేటర్, జనరల్ సర్జరీ మైనర్ ఆపరేషన్ థియేటర్, ఆర్థోపెటిక్ మేజర్ ఆపరేషన్ థియేటర్, ఆర్థోపెటిక్ మైనర్ ఆపరేషన్ థియేటర్ గదులను ఆధునికీకరించారు.





చిత్రంలో కనిపిస్తున్న ఐదేళ్ల బాలుడి పేరు అయాన్. నంద్యాల మండలం చాపిరేవుల. అయాన్ తండ్రి చిన్న ఫక్రుద్దీన్‌ది నిరుపేద కుటుంబం. అయాన్‌కు గొంతులో తీవ్రమైన నొప్పి రావటంతో 20 రోజుల క్రితం నంద్యాల సర్వజన ఆసుపత్రికి తీసుకొచ్చారు. అధునాతన పరికరాల సాయంతో వైద్యులు పరీక్ష చేసి థైరాయిడ్ గ్రంధి పక్కనే నీటి బుడగలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శస్త్రచికిత్స ద్వారా వాటిని తొలగించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నాగరాజు (32). ఇతనిది సోమయాజులపల్లి గ్రామం. భవన కార్మికుడిగా పని చేసే ఇతనికి 15 రోజుల క్రితం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కుటుంబీకులు నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు స్కానింగ్ చేసి పేగు రెండు భాగాలుగా తెగిపోయినట్లు గుర్తించారు. ఆపరేషన్ థియేటర్‌లో అధునాతన యంత్రాల సాయంతో విడిపోయిన పేగును శస్త్రచికిత్స చేసి కలిపారు. ప్రస్తుతం నాగరాజు ఆసుపత్రిలోని ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు.

.. ఇలాంటి ఆపరేషన్లు ఎన్నో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్నాయి. కార్పొరేట్ వైద్య సేవలు ఇక్కడ ఉచితంగా లభిస్తుండటంతో జిల్లా పేదలకు పెద్ద దిక్కుగా మారుతోంది. ఒకప్పుడు క్లిష్టమైన ఆపరేషన్ల కోసం కర్నూలు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆపరేషన్ ఆధునికీకరించడం, అధునాతన పరికరాలు అందుబాటులోకి రావడంతో వైద్యులు మెరుగైన సేవలు అందిస్తున్నారు.



జనరల్ సర్జరీ థియేటర్

క్లిష్టమైన ఆపరేషన్లు చేస్తున్నాం



గతంలో ఏదైనా క్లిష్టమైన ఆపరేషన్‌లు చేయాలంటే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రోగులను తరలించాల్సి వచ్చేది. ప్రభుత్వం నాడు నేడు ద్వారా ఆపరేషన్ థియేటర్‌ను అత్యాధునికంగా ఆధునికీకరించటంతో పాటు అన్ని రకాల అధునాతన పరికరాలు అందుబాటులోకి తెచ్చింది. దీంతో వైద్యులు క్లిష్టమైన ఆపరేషన్లు చేస్తున్నారు. వైద్య, సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే అతి క్లిష్టమైన ఆపరేషన్‌లు కూడా నిర్వహించి ఆసుపత్రికి మరింత పేరు తెస్తాం.

– డాక్టర్ మహబూబ్‌బాషా, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, సర్వజన ఆసుపత్రి, నంద్యాల

తల్లిదండ్రులు మందలించారని..

పాణ్యం: తల్లిదండ్రులు మందలించారని గోరుకల్లు గ్రామంలో బాలుడు, బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహ్మద్ తమ కుమారుడి అన్సర్‌బాషాను చదువుకోమని మందలించగా పురుగుమందు తాగాడు. పనికి వెళ్లేందుకు ఆలస్యమవుతుందని అదే గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ తమ కుమార్తెను దీపికను మందలించగా పురుగు మందుతాగింది. ఇద్దరినీ చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నంద్యాల ఆసుపత్రికి తరలించారు. దీపికకు మెరుగైన చికిత్స అవసరమవడంతో కర్నూలుకు రెఫర్ చేశారు.

పీడితుల పక్షాన రాసే కవిత్వమే ప్రజా కవిత్వం

కర్నూలు కల్చరల్: పీడితుల పక్షాన రాసేసే కవిత్వమే ప్రజా కవిత్వమని ప్రముఖ విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో మహమూద్ రాసిన ఆస్మాని కవిత్వం, పావని రాసిన సిక్స్ ప్యాక్ రాముడు కథల పుస్తకం, అరుణ్ రాసిన కాంతి అలలు కవిత్వం పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. కవులు లక్ష్మీ నరసయ్య, వెంకటకృష్ణ, పాణిలు పుస్తకాలను పరిచయం చేసి ప్రసంగించారు. ప్రపంచీకరణ అనంతరం డిజిటల్ సమాజ మార్పులు, ఆమార్పుల్లో భాగంగా సామ్రాజ్య వాదం కొత్త శక్తుల దోపిడీ అవతారాలను కవులు తమ రచనల ద్వారా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు జంధ్యాల రఘుబాబు, సయ్యద్ జహీర్ అహ్మద్, ఇనాయతుల్లా, ఏవీరెడ్డి, కల్యాణదుర్గం స్వర్ణలత, డాక్టర్ అరుణ, మారుతి, సుభాషిణి పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్): మహిళలు ముందుగా తమ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల ని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్ వద్ద సైక్లోథాన్(సైకిల్ ర్యాలీ) ప్రారంభించారు. ర్యాలీ కలెక్టరేట్ నుంచి మెడికల్ కాలేజీ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జీవన శైలిలో వచ్చిన మార్పులతో శారీరక శ్రమ లేకుండా పోయిందన్నారు. దీనివల్ల అసంక్రమిత వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. వీటి నివారణ కోసం క్రమం తప్పని నడక, సైకిల్ తొక్కడం, యోగా, ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్‌కుమార్, డీఎంవో నూకరాజు, డెమో శ్రీనివాసులు, ఆఫీస్ సూపరింటెండెంట్ అరుణ, డీపీవో విజయరాజు, డీపీహెచ్ఎన్‌వో లిన్నేట్ లిడియా, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో శర్మ, ఎస్‌వో హేమసుందరం తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

సీపీఆర్‌తో మరణాలు తగ్గించవచ్చు

కర్నూలు(హాస్పిటల్): అకస్మాత్తుగా వచ్చే గుండెపోటు మరణాలను సీపీఆర్ చేయడం ద్వారా తగ్గించవచ్చని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో 'సడెన్ కార్డియాక్ అరెస్ట్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ విషయమై డాక్టర్ వసంతకుమార్ మాట్లాడుతూ మన గుండె నిత్యం 60మైళ్ల పొడవుండే రక్తనాళాల ద్వారా అన్ని అవయవాలకు రక్తం పంప్ చేస్తూ ఉంటుందన్నారు. గుండెలో ఏర్పడ్డ బ్లాక్‌లు, విద్యుత్ షాక్‌ల కారణంగా గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ రావడంతో గుండె, మెదడుకు రక్తసరఫరా ఆగిపోతుందన్నారు. ఇలాంటి సమయంలో ఛాతిపై సీపీఆర్ చేస్తే మెదడుకు రక్తసరఫరా పునరుద్ధరించబడి కోలుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించి సమాజంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై శిక్షణ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను హార్ట్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ భవానీప్రసాద్, కల్యాకర చంద్రశేఖర్, వెంకటరాముడు, లక్ష్మన్న సన్మానించారు.

ప్రాణం తీసిన ఈత సరదా



మూర్తుజావలీ (ఫైల్)

బేతంచెర్ల: సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ఓ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. బేతంచెర్ల పట్టణం శ్రీనగర్‌కాలనీకి చెందిన మాబాషా, పాతిమా దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు మూర్తుజావలీ(14) ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తోటి మిత్రులతో కలిసి ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో ఉన్న కోనేరు దగ్గరకు ఈతకు వెళ్లాడు. తోటి మిత్రులతో కలిసి కోనేరులోకి దూకి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. విషయాన్ని మిత్రులు తల్లిదండ్రులకు తెలపడంతో వారు కోనేటి దగ్గరకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి ఇంటికి తరలించారు. ఈతకు వెళ్లి కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వంద శాతం పన్ను వసూలు చేస్తే బహుమతులు

జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు



కర్నూలు(అర్బన్): పంచాయతీల్లో నిర్ణీత సమయంలోగా పన్నులను వసూళ్లు చేసిన ఉద్యోగులకు నగదు బహుమతులు అందించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నాటికి నూరు శాతం పన్నులు వసూలు చేసిన ఈఓఆర్‌డీలకు రూ.10 వేలు, సంబంధిత డివిజినల్ పంచాయతీ అధికారికి రూ.20 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31వ తేదీ నాటికి వర్మీ కంపోస్టును ఎక్కువగా ఉత్పత్తి చేసి అమ్మకాలు చేసిన పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేకంగా సన్మానిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 24వ తేదీన పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఈ బహుమతులను అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెలాఖరు నాటికి జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరములు కలిపి మొత్తం రూ. 22 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.11 కోట్లు మాత్రమే వసూలు చేశారన్నారు. ఇంకా రూ.11 కోట్లను వసూలు చేయాల్సి ఉందన్నారు.

ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం



ల్యాప్‌ట్యాప్‌లను చూపుతున్న ఎస్ఐ కిరణ్

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని దిబ్బనదొడ్డి గ్రామ శివారులో కురువ వీరారెడ్డి మిరప పొలంలో నిల్వ ఉంచిన 9 ల్యాప్‌టాప్‌లు, 660 సెల్‌ఫోన్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ కిరణ్ తెలిపారు. వీటిని నిల్వ ఉంచిన చెన్నై నగరానికి చెందిన ఇబ్రహీం షాహిద్ ఇమామ్, ముంబైకి చెందిన మోహ్మద్‌ఫరాజ్, జావిద్ అన్సారి అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. వాటికి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో సేల్స్ ట్యాక్స్ ఆదోని అసిస్టెంట్ కమిషనర్‌కు అప్పగించినట్లు చెప్పారు.

ఉగాది భక్తులకు మెరుగైన సౌకర్యాలు



సమావేశంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి తదితరులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉగాది ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట జిల్లా రబ్కవిలోని మహాదేవ మల్లికార్జున దేవాలయంలో పలు భక్తసంఘాలు, పాదయాత్ర బృందాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో శ్రీశైల దేవస్థానం తరఫున మల్లికార్జున స్వామి ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, పర్యవేక్షకులు స్వాములు, ఉమేష్, అర్చకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు మల్లన్న అలంకార దర్శనం ఉంటుందని, ఉత్సవాలకు పది రోజుల ముందు, ఉత్సవాల ముగిసినప్పటి నుంచి ఐదు రోజుల వరకు కన్నడిగుల సౌకర్యార్థం మల్లన్న స్పర్శ దర్శనం కల్పిస్తున్నామన్నారు. రోజుకు నాలుగు విడతల్లో ఆరు వేల మందికి అవకాశం ఉందన్నారు. స్పర్శదర్శనం టిక్కెటు రుసుం రూ.500గా నిర్ణయించడం జరిగిందన్నారు. శ్రీశైలానికి పాదయాత్రగా వచ్చే భక్తులకు దాతల సహకారంతో మార్గమధ్యలో మంచినీరు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డా.చెన్న సిద్ధరామశివాచార్య మహాస్వామి మాట్లాడుతూ దేవస్థానం సిబ్బందికి భక్తులు సహకరించాలన్నారు.

నంద్యాలకు మైనింగ్ ఏడీ కార్యాలయం



కర్నూలు(రాజ్‌విహార్): గనులు, భూగర్భ శాఖ కర్నూలు అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని నంద్యాలకు తరలించనున్నారు. జిల్లాల పునర్విభజన తరువాత నంద్యాలలో మైనింగ్ శాఖ కార్యాలయం లేదు. ఈ కారణంగా ఆ జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు నిర్వహించే సమీక్ష సమావేశాల్లో పాల్గొనేందుకు స్థానికంగా అధికారి ఉండడం లేదు. దీంతో ఇక్కడ ఉన్న కార్యాలయాన్ని జిల్లా కేంద్రం నంద్యాలకు తరలించనున్నారు. ఇది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. అలాగే మైనింగ్ కార్యకలాపాలు అధికంగా ఉన్న డోన్‌లోనూ ఓ ఏడీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. అయితే నంద్యాల జిల్లా బనగానపల్లెలో అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఇప్పటికే ఉంది. కర్నూలు జిల్లాలో కేవలం డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం మాత్రమే ఉంటుంది. ఇది కూడా ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లా గనుల శాఖ కార్యాలయంగా మారనుంది.

ఐసీడీఎస్‌లో పలువురికి పదోన్నతులు

- మరికొందరికి స్థాన చలనం

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ, సాధికార శాఖ కర్నూలు జోన్‌లో కొందరికి పదోన్నతులు వరించాయి. మరి కొందరికి స్థాన చలనం కలిగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి.పద్మిని	సూపరింటెండెంట్	ఏసీడీపీఓ(అడిషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్), కర్నూలు
కె.రోజారాణి	సూపరింటెండెంట్, ఆళ్లగడ్డ చిల్డ్రన్స్ హోమ్	ఏసీడీపీఓ, బనగానపల్లె
బి.ఎ.మంగవల్లి	గ్రేడ్–1 ఈఓ, కర్నూలు	ఏసీడీపీఓ, నందికొట్కూరు
కె.నరసమ్మ	గ్రేడ్–1 సూపర్‌వైజర్, కర్నూలు రూరల్	ఏసీడీపీఓ, కోడుమూరు
ఎం.తేజశ్వరి	గ్రేడ్–1 సూపర్‌వైజర్, కర్నూలు రూరల్	ఏసీడీపీఓ, మంత్రాలయం
ఎస్.సౌజన్యకుమారి	గ్రేడ్–1 సూపర్‌వైజర్, కర్నూలు అర్బన్	ఏసీడీపీఓ, నంద్యాల
ఎస్.శోభారాణి	గ్రేడ్–1 సూపర్‌వైజర్, నంద్యాల రూరల్	ఏసీడీపీఓ, వైఎస్సార్ కడప
ఎం.నాగమణి	సీడీపీఓ, కర్నూలు రూరల్	సీడీపీఓ, మంత్రాలయం
కె.వి.బాలమణి	ఏసీడీపీఓ, హిందూపురం	సీడీపీఓ, కర్నూలు అర్బన్
టి.కె.ఉషారాణి	ఏసీడీపీఓ, నంద్యాల రూరల్	ఏసీడీపీఓ, ఆర్‌జేడీ కార్యాలయం, కర్నూలు
కె.నిర్మల	ఏసీడీపీఓ, పత్తికొండ	సీడీపీఓ, ఆస్పరి
వి.బి.అనురాధ	ఏసీడీపీఓ, కర్నూలు రూరల్	ఏసీడీపీఓ, చిత్తూరు జిల్లా కుప్పం
వై.పద్మావతి	ఏసీడీపీఓ, కోవెలకుంట్ల	ఏసీడీపీఓ, నంద్యాల
ఎం.మద్దమ్మ	ఏసీడీపీఓ, పత్తికొండ	ఏసీడీపీఓ, ఎమ్మిగనూరు
బి.విజయకుమారి	ఏసీడీపీఓ, ఆళ్లగడ్డ	సీడీపీఓ, అన్నమయ్య జిల్లా, చిట్వేల్
ఎం.గిరిజ	ఏసీడీపీఓ, డోన్	ఏసీడీపీఓ, తిరుపతిలోని డైరెక్టరేట్ కార్యాలయం